# న్యాయం

సెషన్సు కోర్టులో సుబ్బయ్య హత్యానేరం విచారణ జరుగుతోంది. ముద్దాయి రామకృష్ణ కొత్తగా పెట్టిన కాలేజీలో జవాను.

మూడేళ్ళ వయస్సులో తల్లిని పోగొట్టుకున్న రామకృష్ణను తానే తల్లీతండ్రీ అయి పెంచాడు కన్నతండ్రి సుబ్బయ్య. ఫిఫ్తుఫారం దాకా చదివించాడు. తరువాత పెళ్ళి చేశాడు. పెళ్ళి చేశాక కూడా సుబ్బయ్య బాధ్యత తీరిపోయిందని చేతులు దులుపుకోలేదు. చదువుకున్నవాడై ఇటు కూలిపని చేయలేక అటు ఉద్యోగమూ దొరక్క వుండిపోయిన కొడుకుని పదేళ్ళపాటు కూర్చోపెట్టి పోషించాడు. తరువాత రామకృష్ణకు ఉద్యోగం దొరికింది, కాలేజీలో జవానుగా. సుబ్బయ్య ముసలివాడై పోయాడు. వృద్ధాప్యంతో నిష్ప్రయోజకుడైన తండ్రిని, ఇంతకుముందు తనకోసం ఎంతో కష్టపడ్డాడన్న విషయం విస్మరించి తల గోడకు వేసి పగులగొట్టి చంపాడు రామకృష్ణ. ఈ విషయం రామకృష్ణ భార్య మొదట్లో పోలీసుల కిచ్చిన స్టేట్‌మెంట్‌లో స్పష్టంగా వుంది. ఇరుగుపొరుగువారి సాక్ష్యమూ ఉంది. ఇటువంటి కృతఘ్నుణ్ణి, పరమ కిరాతకుణ్ని ఏం చేసినా పాపంలేదు. ఉరిశిక్ష ఒక్కటే వీడికి తగిన శిక్ష. ఇటువంటి రాక్షసుల్ని సంఘంలో నుంచి వేరుపురుగుల మాదిరి ఏరివేసి నాశనం చెయ్యాలి. ఇదీ ప్రాసిక్యూషన్ వారి వాదన.

సుబ్బయ్య తాగుబోతు. అన్ని వ్యసనాలూ వున్నవాడు. చిన్నప్పటినుండీ రామకృష్ణను తల్లీదండ్రీ తానేయై పెంచాడనేది సర్వాబద్ధం. మేనత్త నాగమ్మ ఇంట్లో ఇంత తిండి తిని, ఇంటికి వెళ్ళగానే తాగివున్న తండ్రి ఏ మిష మీదనో చితక తంతాడనేది తథ్యం కనుక, భయపడుతూనే విధిలేక యిల్లనే నరకంలో ప్రవేశించి తన్నులు తింటూ పెద్దయినవాడు రామకృష్ణ! విధి చేత చాలా చిన్నచూపు చూడబడిన అభాగ్యుడు. ఏ విధమైన అపేక్షనూ ఆప్యాయతనూ ఎరుగక లోకంలో ఉండేది తిట్లూ దెబ్బలూ మాత్రమేననే అనుభవంతో పెరిగినవాడు. ఎప్పుడూ ఎవరికీ ఎదురుమాట

చెప్పనివాడు. అందరూ ఎదురుగానూ చాటుగానూ 'మందమతి' అని వ్యవహరిస్తుంటారు. మూడో క్లాసు చదువుతున్న పిల్లవాడి నుండీ చదువు సంధ్యా లేక రోడ్లమీద తిరిగే రౌడీలవరకూ అందరికీ రామకృష్ణంటే ఎగతాళే! ఎవరేమన్నా అది తనకు తగినదేనన్నట్లుగా ఉదాసీనంగా ఉంటాడు. తనతో పాటుగా చేరిన జవాన్లు ఏడో క్లాసు పాసయిన వాళ్ళు ఎటెండర్లుగా ముందుగా ప్రమోషన్ తెచ్చుకుంటే పదో క్లాసు చదివిన రామకృష్ణ ఇదేమని అడగలేదు. ఇంత ప్రపంచంలోనూ అట్టడుగుకు తొక్కివేయబడి నిర్దాక్షిణ్యంగా నలిపివేయబడటం, తనకు విధి నిర్దేశించిన సహజమైన పాత్ర అని మనసులో గట్టిగా నాటుకుపోయిన రామకృష్ణ తండ్రిని త్రోసి చంపాడనేది నమ్మతగిందిగా లేదు. సుబ్బయ్యే తాగివచ్చి మైకంలో తూలి గోడకు తలకొట్టుకున్నాడు. ప్రాసిక్యూషన్ కథనం పట్టి కల్పితం. పోలీసులు అమాయకురాలైన రామకృష్ణ భార్యను బెదిరించి భయపెట్టి ఆ స్టేట్‌మెంట్ తీసుకున్నారు. తరువాత ఆమే నిజమైన రెండో స్టేట్‌మెంట్ ఇచ్చింది. కాస్త ఆలోచనవున్న ఏ మానవుడూ నమ్మలేని ఈ బూటకపు కేసును మేధావులు న్యాయమూర్తులైన శ్రీ జడ్జిగారు కొట్టివేస్తారని నమ్ముతున్నామన్నారు డిఫెన్సు తరపు న్యాయవాది.

స్తబ్దంగా బోనులో నిలబడి వున్న రామకృష్ణ మనసులో ఆలోచనలన్నీ కలగాపులగంగా వున్నాయి. తనేం చేశాడో నేరం చేశాడో లేదో ఏమీ అర్థం కావటం లేదు. ఆలోచనలు ఏ విధంగానూ ముందుకు సాగక , గజిబిజిగా చిక్కుపడి శిక్ష పడుతుందేమోనన్న భయం భీకరమైన సుడిగుండం కాగా, ఆ గుండంలో సుళ్లు తిరుగుతున్నాయి. ఇంత అలజడిలోనూ ఒకే ఒక ఆరాటం స్పష్టంగా వుంది. ఈ శిక్ష తప్పిపోవాలి!

ఇప్పుడు స్పష్టంగా మరింత గాఢంగా వున్నదన్నమాటేగాని యీ అలజడి ఆరాటం రామకృష్ణకు సుపరిచితాలే... పెన్సిల్ పోయింది. ఎక్కడో జారిపోయింది, జేబు చిరుగులోంచి. 'చిరుగు జేబులో ఎలా వేసుకున్నావురా వెధవా! మొద్దు వెధవ్వి, చేతిలోనించే జారవిడిచి వుంటావు. రోజుకో పెన్సిల్ తేవటానికి సొమ్ము పోగుపోసుకుని కూర్చున్నానా? నీలాంటి మందమతి వెధవకు చదువెందుకురా? ఎర్రటి కళ్లతో తనమీద వున్న పెద్ద మానులాగా నాయన చెయ్యెత్తి నిల్చున్నాడు. ఈ దెబ్బ తప్పితే, ఎవరైనా వస్తే, చెయ్యి తూలి పక్కకు పడితే- ఇంకా మీద పడలేదు... ఎప్పుడు పడుతుందో! అమ్మో చంపేస్తాడు!... ఆనాడూ ఇదే ఆరాటం.

హైస్కూల్లో అడుగుపెట్టినప్పుడు-ప్రసాదరావు- ఇప్పుడు జడ్జిగా కూర్చునివున్న ప్రసాదరావు... రాసుకుంటున్నప్పుడు పెన్నులో సిరా అయిపోయింది. రామకృష్ణ పాత చొక్కాజేబులోంచి మేనత్త నాగమ్మ కొత్తగా కొనిచ్చిన పెన్ను గర్వంగా మెరుస్తోంది. దాన్ని

అడిగి తీసుకున్నాడు ప్రసాదరావు. చీకటి పడుతోంది.

"నీ పెన్ను బాగా రాస్తుంది, రేపిస్తానులేరా" అని ఇంటికి తీసుకెళ్ళిపోయాడు. వుసూరుమంటూ ఇంటికెళ్ళాడు రామకృష్ణ.

"ఏదిరా నీ కొత్త పెన్ను? ఇట్లాగియ్యి" అన్నాడు సుబ్బయ్య తన కూలి డబ్బు గుర్తు రాసుకోవటానికి. నోరు తెరచి నిల్చున్నాడు రామకృష్ణ ఏమీ చెప్పలేక . ఇవాళ నన్ను చంపేస్తాడు పెన్ను లేదని! ఏం చెప్పినా వినడు. చంపేస్తాడు. చంపేస్తాడు, చంపేస్తాడు!... ఆనాడూ ఇదే ఆరాటం.

బోనులో నిల్చున్న రామకృష్ణ మనసులో ఈనాడూ అదే ఆరాటం... శిక్ష పడకూడదు, పడకూడదు, పడకూడదు అని.

భయంతో చిక్కుముడి అయిన రామకృష్ణ మనసులో నుంచీ ఇరుపక్షాల న్యాయవాదులూ తమకు కావలసిన దారాల్ని కావలసినంతమేరకు బయటకు లాగారు. ముడిమాత్రం విడివడలేదు. ఆ పని అసలు ఎట్లా జరిగిందో రామకృష్ణకు తెలియటం లేదు... ఆ రోజున జీతం తెచ్చి సుబ్బులు చేతికిచ్చాడు. అన్నం తినటానికి పోతుంటే సుబ్బయ్య రూపాయి కావాలని అడిగాడు, చిత్తుగా తాగటానికి. తాగి తూలుతూ ఇంటికి వచ్చి ఓపికుంటే రామకృష్ణని ఒట్టి పనికిమాలిన మొద్దు వెధవ అయినందుకూ, ఇంత చదివీ ఎటెండరు పని సంపాయించి ఎక్కువ డబ్బు తేలేనందుకూ తిడతాడు. ఓపిక లేకుంటే అట్లాగే ఏ మూలోపడి నిద్రపోతాడు. సుబ్బులు ముసిలాడికి తాగటానికి పావల ఇస్తుంది ప్రతిరోజూ.

జీతం వచ్చిన రోజున మాత్రం రామకృష్ణ దగ్గర్నుంచి రూపాయి తీసుకుంటాడు ఆ రోజు మర్చిపోయి అంతా సుబ్బులికే ఇచ్చేశాడు.

"దానికిచ్చేశాను, అడిగి తీసుకో" అన్నాడు. సుబ్బయ్యకు కోపం వచ్చింది. సుష్టుగా తాగుదామని ఆశపడ్డాడు. అది ఇస్తుందో ఇవ్వదో?

"ఆడముండ చేతికి డబ్బులిచ్చి దాని చేతిలో ఆడేవాడివి నువ్వా మొగాడివేసంటరా! ఇన్నేళ్ళు ఆ ముండ తెస్తే పెద్దోడివయ్యావా, నేను పెడితే అయ్యావా? ఇవాళ పుట్టగోశంతా వుద్యోగం వస్తే నేనూ మొగోడినని అనుకుంటున్నావేమో. దాన్నడిగి డబ్బులు తీసుకోమంటావంటరా ఎదవా! నీ చేతికొచ్చిన నాడైనా అట్టే పెట్టుకోలేవంటరా?... ఒక్క నలుసుని కనలేని ఎదవ!..." అంటూ తిట్లు మొదలెట్టాడు.

సుబ్బులు కూలికి పోయివచ్చి అన్నం వండిందేమో, అసటగా నిల్చుని చూస్తున్నది. ఎంత గర్వంగా తొంభై అయిదు రూపాయలు తెచ్చి దాని చేతిలో పెట్టాడు తాను! రామకృష్ణకు నాయన మీద ద్వేషం పుట్టుకొచ్చింది.

"నోరుముయ్యి" అన్నాడు. సుబ్బయ్య ఒక్క నిముషం ఆగి-

"ఓహో! వానపాముకి కోరలొచ్చినాయే ఎప్పుడో" అన్నాడు, అంత ఎగతాళీ ఒక్క వాక్యంలో ఇముడ్చుతూ.

"అవున్రా, ఎదవా, పుట్టుఎదవ్వి నువ్వు. పదేనేళ్ళయి పెళ్ళయి ఒక్క నలుసుని కన్నావట్రా? అది చూసి చూసి ఎవడ్నో తగులుకుంటుంది. నువ్వు ఎదవ ముండల్లే కూర్చో" అన్నాడు.

ఇంత ప్రపంచంలో తనూ ఒక మనిషనీ, మొగుడనీ చదువుకున్న వాడనీ గుర్తు పెట్టుకొని కాస్త చెప్పిన మాట వినేది సుబ్బులు. దాని ముందు ముసిలాడి మాటలు రామకృష్ణ సహించలేకపోయాడు. ఆవేశంలో పిడికిళ్ళు గట్టిగా బిగుసుకుపోయాయి. పళ్ళు గిట్టకరుచుకుపోయాయి. "ఏందీ...మళ్ళీ కుయ్యి" అంటూ ముందుకి పోయాడు.

"పోన్లే ముసిలాడి మాటలకేం" అన్నది సుబ్బులు. ముందుకు పోయిన రామకృష్ణకి ఒళ్ళు తెలియలేదు. ఎన్నో ఏళ్ళ నుండి పేరుకుపోయిన ద్వేషానికి కట్ట తెగింది. సుబ్బయ్యను ఒక్క తోపు తోశాడు. తల పట్టుకుని గట్టిగా గోడకేసి కొట్టాడు. అంతే. "చంపితివి కదరా ఎదవా!" అని అరిచాడు సుబ్బయ్య.

ఇరుగుపొరుగున వాళ్ళు వచ్చేసరికి తల పగిలి రక్తం మడుగులో వున్నాడు. రామకృష్ణ మొద్దుగా చూస్తూ అక్కడే నిలబడిపోయి ఉన్నాడు.

'ఏందిరా మందమతి ఏమైందిరా' అన్న సోములి మాటలతో యీ లోకంలోకి వచ్చాడు.

తరువాత పోలీసులూ, సంకెళ్ళూ, గందరగోళం. వున్న ఇల్లు కాస్తా తనఖా పెట్టి డబ్బు తెచ్చి లాయర్లను పెట్టించింది సుబ్బులు.

★★★

జడ్జి ప్రసాదరావు మనస్సు గతంలోకి పరుగెత్తింది. తన చిన్నప్పుడు నాన్నగారు ఆ వూళ్ళో ఉద్యోగంలో వుండేవారు. చిన్న చొక్కాలో ఇరుక్కున్న పెద్దమనిసిలాగా -ఇరుగ్గా ఇబ్బందిగా. అప్పుడు ఆ వూరు చిన్నది. కాలేజి లేదు. ఈ రామకృష్ణ తనకు చాలా మిత్రుడు అక్కడ. తామిద్దరూ మొదట పరిచయమైన సన్నివేశం బాగా గుర్తు వుంది. ఆ రోజున తాను బళ్ళో నోట్సు రాసుకుంటూ వుండిపోయాడు ఆలస్యంగా. వాడి పెన్ను పట్టుకొచ్చేశాడు. ఇంటికొచ్చేసరికి నాన్నగారు బోనులోని పులిలాగా పచార్లు చేస్తున్నారు. ఆయన చండశాసనుడు. ఆలస్యంగా యింటికొచ్చినందుకు కొడతారేమోనని భయం వేసింది. నోట్సు రాసుకుంటూ వుండిపోయానని చెప్పాడు తాను. 'వేళకు ఇంటికి రావాలంటే రావాల్సిందే. ఆ నోట్సు ఇంటికి పట్టుకొచ్చి రాసుకోకూడదూ?' అంటూ పర్వతంలాగా నిల్చుని తిడుతున్నాడు. అమ్మ వచ్చింది.

"అసలే జ్వరంపడి లేచాడు. భయపడిపోతున్నాడు మీ కేకలకి. ఈ మూడురోజులు నోట్సు రాసుకుంటూ వుండిపుంటాడుగాని ఇవాళ్టికి పూరుకోండి" అంటూ తనని తీసుకువెళ్లిపోయింది. నీ మూలాన్నే వాడు చెడిపోతున్నాడు అని అమ్మమీద కేకలేశారు నాన్నగారు.

మరునాడు రామకృష్ణ చెప్పాడు- పెన్ను తేలేదని వాళ్ల నాన్న బాగా కొట్టాడట. 'ఆలస్యంగా వెళ్లినందుకు నన్నూ కొట్టబోయాడు మా నాన్న' అన్నాడు తాను. నాన్నల నిరంకుశత్వానికి బలి అవుతూ వున్న ఇద్దరు బాలుర పరిచయం అట్లా మొదలైంది.

రామకృష్ణ తండ్రి చాలా క్రూరుడు అనే విషయం తనకూ బాగా జ్ఞాపకమే. రామకృష్ణకు అమ్మలేదు. అంతరాత్మ నెరుగని శాసనంలో పెరిగాడు. క్షమ, ప్రేమల నెరుగని శాసనానికి తల ఒగ్గిన మనసు మందమతి కాక ఏమవుతుంది? అమ్మ లేకుంటే తనూ అంతే అయి వుండేవాడా? ఏమో! పాపం, రామకృష్ణ!

శాసనం, అంతరాత్మ పూర్తిగా భిన్నమైనవి రెండూ. అంతరాత్మనెరుగని చండశాసనంనుంచీ క్రూరత్వం పుట్టుకొస్తుంది. శాసనం ఎరుగని అంతరాత్మనుంచీ అరాచకం ఉద్భవిస్తుంది. వ్యక్తికీ, సంఘానికీ కూడా అర్థం చేసుకొని క్షమించే మెత్తని వెన్నలాంటి అంతరాత్మకు గట్టితనాన్నిచ్చే శాసనం...నియమం..అవసరమే. సంఘం యొక్క స్థితినిబట్టి ఆ రెండూ ఒక బాలన్సు ఏర్పరుచుకుంటాయి. అప్పుడు ఏర్పడేది చట్టం. సంఘక్షేమం దృష్ట్యా ప్రయోజనం దృష్ట్యా ఏర్పడుతుంది అది. తానీ వేళ దానికి మంచి ప్రతినిధి కాగలిగాడంటే దాంట్లో అమ్మ పాత్ర ఎంత వుందో నాన్నగారి పాత్రా అంతే వుంది. తన ప్రేమంతా అమ్మ మీదైతే గౌరవమంతా నాన్నగారిమీద. తన మనసే అమ్మయితే అది సువాసనలీనే మంచి గంధపు చెక్క అయితే దాన్ని శ్రీకృష్ణుని మూర్తిగా మలచింది నాన్నగారు.

తనకీ విషయం తెలియనప్పుడు తనకింత విచక్షణా జ్ఞానం ఏర్పడనప్పుడు తాను నాన్నగారిని ద్వేషించాడు. అమ్మ మెత్తదనాన్ని చూసి కోపగించుకున్నాడు. ఎందుకీ అమ్మ నాన్నగారికి తగిన సమాధానం చెప్పదు? ఎందుకు తిరగబడదు? ఎందుకు వేరైపోదు? అని అర్థంలేని కక్ష పుట్టుకొచ్చేది.

ఇప్పుడు వాళ్లిద్దరూ లేరు. తన జీవితమే వాళ్ళ జ్ఞాపకానికో వందనం. వాళ్ళు ఏర్పరచుకొన్న భావ సమన్వయానికి సజీవ ప్రతిబింబం.

ఇప్పుడు తన ఎదురుగా వున్న సమస్యకు న్యాయమైన పరిష్కారం చెయ్యాలి. రామకృష్ణ పరిస్థితి తనకు బాగా తెలుసు. సుబ్బయ్య గుణమూ తెలుసు. రామకృష్ణ మీది ఆనాటి అభిమానం తాను మరిచిపోలేదు. బాల్య స్నేహితుణ్ణి చూసి నిట్టూర్చాడు ప్రసాదరావు.

ప్రసాదరావు-చిన్ననాటి ఆప్తమిత్రుడు - తనను తప్పకుండా గుర్తించి వుంటాడు. తననూ, తన తండ్రియొక్క క్రూరత్వాన్నీ బాగా ఎరిగిన ప్రసాదరావు జడ్జిగా రావటం తన అదృష్టం. తప్పకుండా కేసు కొట్టేస్తాడు. తన తప్పేమి లేదని తెలుసుకుంటాడు, తన తండ్రి రాక్షసుడని బాగా తెలిసిన ప్రసాదరావు. రామకృష్ణ మనసులో ఆశ.

★★★

ఏడేళ్ళు కఠిన శిక్ష పడినదని విన్నప్పుడు రామకృష్ణకు అంతా చీకటే అయింది. తన తండ్రి విషయం బాగా ఎరిగిన ప్రసాదరావే తనకీ శిక్ష విధించాడా?

ఎందుకు? ఎందుకు? ఎందుకు?

వున్నట్లుండి హృదయంలోంచీ ఒక పెద్ద ఆర్తనాదం... ప్రపంచంతో సంబంధం విడిపోయిన పిచ్చివాడి ఏడుపు... బయటికి వచ్చింది. 'ఓ' అంటూ పెద్దగా ఏడిచాడు రామకృష్ణ.

★★★